# ఎవరు ఎవరికి బాకి

ఆరోజు శుక్రవారం.

ఎందుకో, శలవు. పండగ మాత్రం కాదు. నాకు సెలవున్న రోజున పని మనిషి రాదు. ఒకవేళ వచ్చినా లేట్, నా సెలవుల సంగతి నా కన్నా దానికే బాగా తెలుసు. అపుడే మా అత్తగారు గొణిగేస్తున్నారు.

"శుక్కురారం పూట పాచి గుమ్మం అలా ఉంటే జేష్టాదేవి కూచుంటుంది. లేచి తొందరగా గుమ్మం కడుగు... అది నేను చెప్పాలా!"

తప్పేదేముంది నీళ్ళ బక్కెటు, చీపురు కట్ట, చాక్‌పీస్ మూడు ఒక్కసారే తీసుకెళ్ళి పాచి పని చేస్తున్నాను.

అప్పుడే చీకటి ఛాయలు అలా అలా పోతున్నాయి. ఎర్ర రంగుని వెంటబెట్టుకొని ఉదయం వస్తోంది.

గేటుని టక టకలాడించిన శబ్దం.

పేపరు వాడు గేటుకి పేపర్లు పెడ్తున్నాడనుకుని వెనక్కి తిరక్కుండానే ముగ్గుని చాక్‌పీస్‌తో వేస్తున్నాను.

"ఏమండి! " మళ్ళా గేటు శబ్ధం రెండు ఒక్కసారీ వినిపించాయి. వెనక్కి తిరిగి చూసాను.

గేటుకి అవతల ఓ పాతికేళ్ళ యువకుడు. రంగు తగ్గిన పాంటు షర్ట్ జులపాలు, జుట్టు తెల్లగా చిక్కిపోయిన ఏసుక్రీస్తులో ఉన్నాడు. భుజాన ఓ సంచి 'ఏం కావాలన్నట్లు' తల ముందుకి ఊపాను.

'గది అద్దెకి కావాలి. ఉందా !"

"లేదు" అన్నాను.

'ఎవరే వస్తే' అంటూ అత్తయ్య గుమ్మం దగ్గర కొచ్చారు. ఆవిడ వెనకాలే మామగారు వాళ్ళ యింట్రెస్ట్ అలాంటిది.

మేం ఉంటున్నది కొంపల్లి దగ్గర యిళ్ళు పెద్ద ఎక్కువగా లేవు. మా యింటికి రావాలంటే ముందుగా మాకు తెలియపరిస్తే. అడ్రస్సు కొండగుర్తులు, లాండ్ మార్కులు చేప్తే కాస్తగా అటూ ఇటూ తిరిగి, కొంచెం కన్ఫ్యూజ్ అయ్యి, మళ్ళా మరోసారి ఫోన్ చేసి, మళ్ళీ సరిగ్గా కనుక్కుని వస్తారు.

పెద్దగా అతిధులు రాని మాయింటికి నేను ఎవరితోనో మాట్లాడేప్పటికి కాలక్షేపం లేక, అవకాశం కోసం చూస్తున్న వాళ్ళిద్దరూ ఉత్సహంగా బయటికొచ్చి గుమ్మం దిగి గేటు వరకు వెళ్లారు.

"ఏం కావాలి?" అంటూనే గేటుకి యివతల నుంచున్నారు ఇద్దరూ.

"అద్దెకి గది ఉందా అని అడుగుతున్నాడు. " అన్నాను.

"గదులెక్కడున్నాయి"?

"అదే నేను అన్నాను." ఆ అబ్బాయి వెళ్ళలేదు

"ఇది ఉంది కదా!" అంటూ మా చిన్న కాంపౌండులోనే ఓ మూల నున్న రేకులు కప్పిన, సిమెంటు ప్లాస్టర్ చెయ్యని ఇటుకల గదిని చూపించాడు.

"ఆదా!" నాలుక చప్పరించేసారు మామగారు. అవునన్నట్లు తలూపాడు.

" అది గది కాదు అన్ని పాత సామానులు, మిగిలిపోయిన సిమెంట్ బస్తాలు యిసుక బస్తాలు, ఇటికెలు, అవీ అందులో ఉన్నాయి. పైగా అందులో సదుపాయాలేం లేవు.

"పర్వాలేదండి.... నేను సద్దుకుంటాను నా తల దాచుకోడానికి, పైన ఓ కప్పుంటే చాలు పైగా నాకుద్యోగం లేదు. కొంచెం మంచిది కావాలనుకుంటే అద్దెలు చాలా ఉంటాయి. ఇంతకన్నా మంచిది నేను కోరుకోవడం లేదు. అని ఆశగా చూసాడు.

"అంటే.... ఊరికే ఉందామనుకుంటున్నావా!" టక్కున అత్తయ్య అన్నారు

"అబ్బే ... లేదండి... అద్దె యిస్తానండి'

"ఉద్యోగం లేదంటున్నావు కదోయ్! అద్దె ఎలా యిస్తావ్?"

"వెతుక్కుంటాను ఈ చుట్టూరా జీడిమెట్ల, బాలానగర్, సనత్‌నగర్ అన్ని

యిండస్ట్రియల్ ఏరియయలే కదండి...

చిరాకు పడ్డాను. 'లేదు అద్దెకు ఇవ్వం.' అని వచ్చేస్తూంటే మామగారు, అత్తగారు, నా వెనక్కాలే వచ్చారు.

" యిచ్చేద్దాం... ఎంతో కొంతకి... ఎదుగుతున్న పిల్లలున్నారు. మేం యిద్దరం జీరో ఇన్‌కంతో ఉన్నాం, ఇంటికి తీసుకున్న లోనుంది ఏదో చన్నీళ్ళు. కూరా, నారాకి సరిపోయినా పర్వాలేదు."

మనసులోనే ఏడ్చాను. వాళ్ళకేం గది అద్దెకిచ్చేస్తారు. పని చెయ్యరు. కానీ, వీళ్ళిద్దరూ సూపర్‌విజన్ చేస్తారు. యిక్కడ వస్తువు అక్కడ పెట్టరు. పిల్లలిద్దరూ చిన్న పిల్లలు. ఇంక సరే ఆయనయితే మంచం విరిగేట్లు మంచానికతుక్కు పోతారు.

మిగిలింది నేనే కదా!

గది చూడ్డానికి చిన్నగా కనిపిస్తుంది కానీ, మొదలు పెడ్తే లారీడు సామానుని ఈజీగా డంప్ చేయచ్చు. పనికిరాదు, పారేయలేము, ఏవిటో ఏం సామానో. ఎంత కూడ బెట్టామో!

ఈ పనిమనిషి పీనుగ కూడా రాలేదు.

ఛ! ఇవాళ సెలవంత ... ఈ క్లీనింగ్ లో....

"దాన్నిండా... బోల్డు సామాను." అని నసిగాను.

"నే సద్దుతానండి..... మీరిచ్చాను అని ఒక్క మాటనండి చాలు... నేను చూసుకుంటా అంత."

ఆ అబ్బాయిని చూసి మా అత్తగారు, మామగారు ముచ్చట పడ్డారు. ఈ యింటి కొచ్చాకా వాళ్ళిద్దరికిఈ మాట్లాడేందుకు ఎవరూ లేక ఒక్క రవ్వ పిచ్చెక్కినట్టుగానే ఉంది. ఇంతవరకు విసుక్కున్నా కసురుకున్నా పిల్లల్తోనే మాట్లాడేవారు.

సామానుసద్దడానికి ఉండే విధంగా గదిని సద్దడానికి పూర్తి రోజు పట్టింది. అయితే అంతా చంద్రమే చేసారు.

ఆ రోజంతా చంద్రం...చంద్రం.. అంటూ వాళ్ళిద్దరూ, పిల్లలూ ఉత్సాహంగా గడిపేసారు.

మా మామగారు యింట్లోంచి వైరు లాగి బల్బు పెట్టారు. మెట్లకింద పాత యినప మంచం ఉంటే ఉదారంగా యిచ్చెయమన్నారు.

అత్తగారు మాకు అక్కర్లేదని ఓ కూజా గ్లాసు యిచ్చారు. ఆ సాయంత్రం టీ, దానితో పాటూ ఓ నాలుగు జంతికొక్కళ్ళు పిల్లలతో పంపాను.

ఆ రాత్రి మా అత్తగారు ఏదో రహస్యం చెప్తున్నట్టుగా నాతో అన్నారు. "రేపు అద్దె గురించి మాట్లాడు. రెణ్ణెల్ల అడ్వాన్స్ కూడా యివ్వాలని చెప్పు. చెప్పకపోతే... ఆ పిల్లాడి కెంత యివ్వాలో ఎలా తెలుస్తుంది?

అద్దె ఎంత తీసుకోవాలో, ఆ గది ఎంత విలువ చేస్తుందో నాకు తెలీదు. అందుకని ఆవిడ అన్నదానికి ఏం మాట్లాడలేదు.

మర్నాడు సాయంత్రం తన గది ముందు మా పిల్లలిద్దర్నీ ముం దు పెట్టుకుని హోం వర్కులు చేయిస్తున్నాడు. మనోహరంగా, హాయిగా అనిపించింది. ఆ దృశ్యం.

'హమ్మయ్య! ఓ భారం తగ్గింది.' అనుకున్నాను తేలిగ్గా.

' అన్న లెక్కలు బాగా చేస్తాడు. " అని అన్నాడు. నానిగాడు 'అన్న' వరస కలిపాడు.

'ఆ..... ఆవును.... బాగా చేస్తాడు " అంటుంది. బుజ్జి నాకునిశ్చింత.

చంద్రం అడ్వాన్స్ యివ్వలేదు. నేనడగలేదు. నాలుగు రోజులు చంద్రం కనపళ్ళేదు. షిప్పుల్లో ఏదో ఉద్యోగం దొరికిందట. మనిషి ఉన్నాడనడానికి బనీను, తువ్వాలు కొబ్బరి చెట్టుకింద తాడు మీద ఎండేసి ఉన్నాయి.

ఓ ఆదివారం పెద్ద వర్షం. పిల్లలిద్దరూ పరిగెత్తుకుంటూ వచ్చారు.

"చంద్రం అన్న గదిలో అన్ని నీళ్ళు"

"రేకులు ఎప్పుడో వేయించాము. చిల్లులున్నాయేమో" అని రెండు పాలిథిన్ పేపర్లు వడియాలు అప్పడాలు, వొరుగులు ఎండ పెట్టడానికి వాడేవి

పెద్ద పెద్దవి బాత్రూంకి పైన ఉన్న లోఫ్ట్‌లోంచి తీసి యిచ్చాను.

ఈ లోగా గొడుగేసుకుని మావారు బయటకెళ్ళి చంద్రాన్ని వెంట పెట్టుకొచ్చారు.

'ఇవ్వాళ చంద్రం మనతో పాటే భోంచేస్తాడు."

వంటింట్లోకి వెళ్ళిన నాతో బుజం తట్టి అన్నారు. "ఇదిగో అప్పుడే నెల దాటింది. అద్దె అడుగు మర్చిపోకు......"

"అడుగుతాను. అయినా యిప్పుడే కదా ఉద్యోగంలో చేరాడు. యిస్తాడు. యివ్వకుండా ఈ గుమ్మం దాటగలడా" 'మీరజాలగలడా నాయనతి అన్న స్టైయిల్లో అన్నాను.

ఆ రోజే కాదు, ఆ తర్వాత చాలా సార్లు మా యింట్లో భోంచేసాడు. ఎన్నో మాట్లాడేవాడు. కాని అద్దె గురించి ఎప్పుడు అడగలేదు అడగ దల్చుకోలేదు.

ఎక్కువ వాళ్ళ యింటి విషయాలే చెప్పేవాడు. వాళ్ళ ఊరు యిల్లు, బీదరికం, పంటలు, వర్షాలు, కరవు దీని గురించే చాలా ఆవేశంగా మాట్లాడేవాడు. ఆ పదాలు, ఆ భావాలు నాకు చాలా నచ్చాయి.

రోజు పిల్లల హోం వర్కులు చేయిస్తాడు. ఏవో వింత వింత విషయాలు చెప్తాడు.

అద్దె విషయం మర్చిపోయినపుడు మాత్రం మావగారు అత్తగారు చంద్రం దగ్గరుండేవారు ఏదేదో ఉత్సాహంగా మాట్లాడేవారు.

ఓ రోజున యిడ్లీలు పెట్టాను.

"రాత్రి అన్నం తినం ఇవ్వాళ శనివారం యిడ్లీలే తింటాం ఉపోషం"

"ఇవ్వాళ అన్నం బదులు ఇడ్లీలు, ఛేంజ్ కోసం అంటే బాగుంటుంది కదా ఇంత దానికి శనివారం అని అనడం దేనికి.?

"వెంటనే అలా అనేసావు. కొంపతీసి నువ్వు కమ్యూనిస్టా ఏంవిటి?"

"నేను పుట్టి పెరిగిన వాతావరణంలోని మాబాధలు, జరిగిన అన్యాయాలు చూసి, చూసి మా కొచ్చిన భాషేఅది.

దానిని కమ్యూనిస్టుల భాష. అని మీరనుకుంటే నేనేం చెయ్యలేను.

ఒక్కసారి మా ఊరు రండి... కనుచూపుమేర వరకు పర్రలు, ఎప్పుడూ కరువే. దానితో తిండికి కరవు, బట్టకి కరవు, నీళ్ళకి కరవు, మేఘాలకి కరవు, వర్షాలకి కరవు, ఆఖరికి కళ్ళలో నీళ్ళు కూడా కరవే. మా జీవితాలు కరవులు మధ్య గాలిలేక ఉక్కిరి బిక్కిరి అవుతుంటే.... దానికి కమ్యూనిజం .....కమ్యూనిస్ట్ అని పేర్లు అక్కర్లేదు."

చాలా బాధ పడ్డాను.

నా ఉద్దేశం అది కాదు...."

" మా పూర్వీకులు రక్త త్యాగాలు చేసారు. ప్రాణ త్యాగాలు చేసారు. అయినా అపుడు ఇపుడు మా బతుకులు ఒకటే.

మార్కెటు పంటల గారడిలో చిన్న రైతులు చితికి పోయి కూలీలుగా మారిపోయారు.

కూలీలు ఉపాధి లేక దొంగలో, తిరుగుబాటు దారులో అవుతున్నారు.

విద్యావకాశాలు ఎక్కువయ్యాయో లేదో కానీ, నిరుద్యోగులై పోయారు. ఇదీ వర్తమానం

అన్యాయం జరిగినప్పుడు గుండెల్లోంచి వచ్చే భాష మాది. వేడి రక్తం వరదలో పారుతుంటే ఆ సెగల్లోంచి వచ్చిన భాష మాది.

అక్కా! ఒక్కసారి మా ఊరు రా పేగు తెగిన ఆక్రోశాలు, తాళి తెగిన దుఃఖాలు, గుండె గాయాల్లోంచి వచ్చిన కన్నీరు... రాజకీయ సర్పయాగంలో అమాయకులు మల మల మాడుతున్నారు. అయినా నేను దేవుణ్ణి గుర్తు చేసుకొను. చేసింది చేయించింది మనుషులు, దానికి దేవుడికి లంకె లెందుకు?"

"అలాగేలే...ముందు మాములుగానే ఇడ్లీలు తిను.... ఒకవేళ అనుక్కో ఒకవేళ దేవుణ్ణి ప్రార్థించాల్సిన సమయం వస్తే" నవ్వాడు.

"దేవుడుంటే... మాతల రాతల్ని ఏనాడో మార్చేవాడు. కష్టాల్లోనూ, నష్టాల్లోను, బలహీన క్షణాల్లో ... దేవుణ్ణి ప్రార్థిస్తే మారాతలు మార్చేస్తాడా!"

చంద్రం మాటలు నాలో నిలిచిపోయాయి. ఎంత కచ్చితంగా మాట్లాడుతు తర్వాత ఎందుకో నాకు చాలా నచ్చాడు. వాళ్ళ యింటి విషయాలు.... చంద్రం మీద సాఫ్ట్ కార్నర్ ... ప్రతి రోజూ ఏదో ఒకటి యిచ్చేదాన్ని

దోమలు బాగా ఉన్నాయని ఓ టేబుల్ ఫాన్, అది పెట్టడానికి ఓ ముక్కాలి పీట యిచ్చాను.

రేకుల కప్పు మూలంగా చలి ఎక్కువని, పాత చీరలు పేర్చి మెత్తటి బొంతలాగా, అందంగా శిల్పారామంలో అమ్మే క్విల్ట్ లాగా తయారుచేసి యిచ్చాను.

ఆ తర్వాత వరసగా నాలుగు రోజులు వర్షాలు అందువల్ల ఫాక్టరీలో ఉండి పోవాల్సి వచ్చిందని, నాలుగు రోజుల తర్వాత కనపడ్డ చంద్రం అన్నాడు. ఆ సంగతి మేం కూడా పెద్దగా పట్టించుకోలేదు. టీవిలో వర్షాకాలం వాటి వల్ల ప్రజల కొచ్చిన కష్టాలు, నష్టాలు చూస్తూండి పోవడంలో మునిగిపోయాం.

మా ఆడపడుచు కూతురి ఎంగేజిమెంట్ దాని కోసం హైద్రాబాద్‌లో మరో మూల ఉన్న హయత్ నగర్ వెళ్ళాల్సి వచ్చింది. రాను పోను రెండు రోజులు. ఓ రోజు ఫంక్షన్, ఓరోజు అందరం కూచుని కబుర్లు నాలుగు రోజులయ్యాకా వచ్చాము.

చంద్రం గది తాళం వేసి వుంది. ఆగష్టు నెల, స్కూల్లో సిలబస్ కంప్లీట్ చెయ్యడం రెండో యూనిట్ టెస్టులు, పేపర్లు ప్రొగ్రెస్ కార్డులలో నేను బిజీగా ఉండిపోయాను.

కానీ పిల్లలు మటుక్కు రోజుకోసారైనా గుర్తు చేసుకునేవారు.

'అయ్యో' అద్దె యివ్వలేదు ... ఎక్కడికో వెళ్ళిపోలేదు కదా కొంపదీసి' అన్నారు అత్తగారు బెంగగా.

ఎంటో, ఎదోలాగా అనిపించింది.

మరో రెండు రోజుల చంద్రం గురించే మాట్లాడుకున్నాం.

"హవ్వ! ఎనిమిది నెలలున్నాడు ఉట్టిగా,.....ఒక్కపైసా అద్దె యివ్వలేదు.

పైగా పెళ్ళి కొడుకులా మర్యాదలు సమస్తం జరిగాయి భోజనాలు, టిఫినీలు, కాఫీలు, ఎవరైనా వింటే సిగ్గుచేటు... అద్దె అడుగడం చాతకాలేదు. హవ్వ...."

నా మంచితనాన్ని అలుసుగా తీసుకున్నాడా!

అక్కడ నుంచో లేక పోయాను.

గోడకి ఉన్న తాళం చెవుల బోర్డులోంచి తాళం చెయ్యి తీసుకుని చంద్రం గదికి వెళ్ళాను.

అత్తగారు మామగారు పిల్లలు అందరూ నా వెనాక్కలే వచ్చారు. ఎదురుగా ఉన్న అద్దానికి ప్లాస్టర్‌తో ఓ కాయితాన్ని అంటించారు.

"చంద్రం రాసిన ఉత్తరమా! ఓ సారి చూడు......"

నేనేం మాట్లాడలేదు. తీసి చూసాను. అది ఉత్తరమే. తీసి చదువడం మొదలు పెట్టాను.

అక్కా

మా అమ్మపేరు తెలీని జ్వరం వచ్చి చావు బతుకుల్లో ఉందని మా తమ్ముడు రాసిన ఉత్తరం పదిహేను రోజుల తర్వాత ఈ వర్షాల మూలంగా చాలా ఆలస్యంగా ఈ రోజునే వచ్చింది. అందుకే యిలా చెప్పకుండ వెళ్ళాల్సి వచ్చింది.

మిమ్మల్ని కలుస్తానో లేదో నాకు తెలీదు. కానీ నా జీవితాంతం నేను, నా తరవాత జనరేషన్ వాళ్ళు కూడా గుర్తు పెట్టుకుంటారు. నేను అద్దె చెల్లించకపోయినా, ఏనాడు మీరు అడగలేదు. పైగా మా అమ్మలాగా నా కడుపుని తడిమి తడిమి చూసారు. మీ బాకి నేను తీర్చగలనో లేదో నాకే తెలీదు. మళ్ళీ నేను హైద్రాబాద్ వస్తానో లేదో కూడా తెలీదు.

అప్పుల్లో పడ్డ మా నాన్న ఆత్మ హత్య చేసుకున్న రైతుల్లో ఒకరు. ఆయిన ఎలాగు లేరు. ఇప్పుడు నేను వెళ్ళేసరికి మా అమ్మ బతికి ఉంటుందో లేదో కూడా తెలీదు. ఇప్పుడు అమ్మకేమయినా అయితే నా కన్నా చిన్న వాళ్ళని నేను అలా వదిలేసి యిక్కడెలా ఉంటాను? ఇక్కడ దొరికే ఇలాంటి చిన్న

ఉద్యోగాలో, ఇక్కడ వచ్చే ఇంత తక్కువ జీతాలు మా పక్క జిల్లాల్లోనే దొరుకుతాయి. పెద్ద కొడుకుగా నాబాధ్యత ధర్మం నిర్వర్తించపోతే మా నాన్న చేసినదే నేను చేసినట్లవుతుంది. నన్నునేను క్షమించుకోలేను. అందరం ఒక్కచోటే ఒకళ్ళకొకళ్ళు అని అనుకుంటాం ఆ మానసిక బలం ఇప్పుడు మాకు కావాలి. ఏదో అనుకుని హైద్రాబాదు వచ్చాను. కానీ. దూరపు కొండలు నునుపు కాదు. గరుకు ....

ఇట్లు చంద్రం.

పి. ఎస్. ఈ ఉత్తరం మీకు కనపడేలాగా పెట్టడానికే చాలా ట్రై చేసాను. కానీ పడుతున్న వర్షం వల్ల అంత తడిసి పోతుందనిపించింది. నేను వెళ్ళి పోయానని తెలిసాకా నా గదిలోకి ఎలాగు వస్తారు అని తెలుసు. అందుకే తలుపు తెరవగానే కనపడే విధంగా ఈ అద్దానికి వైరుకున్న ఆకుపచ్చని ప్లాస్టర్‌తో అంటించాను. ఆలస్యంగానయినా విషయం తెలుస్తుంది కదా!

నాని, బుజ్జి కళ్ళల్లోనే మెదలుతున్నారు. పాశాలు, బంధాలు, వదులుకోవడం చాలా కష్టం, కానీ తప్పదు అని మా అమ్మ పరిస్థితి చదివాకా అర్థం అయింది..... చంద్రం.

ఉత్తరం మడిచాను. అత్తగారు నా మొహంలోకే చుస్తున్నారు.

“వెళ్ళిపోయాడా! నాకెప్పుడో తెలుసు నేనునుకుంటూనే ఉన్నాను.... ఇలాంటిదేదో జరుగుతుంది నెత్తిని ఎక్కించుకున్నందుకు మాబాగా పెట్టాడు. శరగోపం. ఇంతకీ మనం యిచ్చిన సామానులున్నాయా!”

ఈ లోపల పిల్లలిద్దరూ రెండు సంచులు తెచ్చి మా ముందు పెట్టారు. “అమ్మ! చూడు... ఎన్ని పుస్తకాలో......” అని అన్నారు.

వెంటనే పుస్తకాల కేసి చూసాను. ఒక్కొక్క పుస్తకం తీస్తున్నాను, దానిలోని పేజీలు తిప్పుతున్నాను.

“పుస్తకం కనపడ్తే చాలు, ఒళ్ళూ పై తెలీదు... వాటినక్కడ పెట్టు......” ఆవిడ మాటలు వినిపించుకోలేదు.

పేజీలు తిప్పుతున్నాను.

ఎన్నో అనువాదాలు. నాకు నచ్చిన రష్యన్ సాహిత్యం యింకా ఎన్నో తన కొచ్చే ఆదాయమెంత? ఆ రాబడికి ఈ పుస్తకాలు ఇన్ని పుస్తకాలు కొన్నది. పది, పదిహేనే రూపాలయలకి కావచ్చు కానీ వెల కట్టలేనివి.

"ఏంవిటో పుస్తకాలు? ముందు సామాను చూడు రజాయి, ఫాన్, తలగడ... " చెప్పుకుపోతున్నారు.

ఆవిడ వైపు నిశితంగా నిశ్శబ్ధంగా చూసాను.

"మనవి ఉన్నాయి.... అతనివీ ఉన్నాయి... అతనేం తీసుకెళ్ళలేదు." మహానుభావుల భావాలు, ఆలోచనలు, అభిప్రాయాలు, జ్ఞానం, అక్షర రూపేణా ఉన్న నిధిని నాకిచ్చి వెళ్ళారు. నా గుండెకి తెలుసు ఆ నిధి విలువ ఎవరు ఎవరికి బాకి? మేమా? చంద్రమా?

ఋణగ్రస్థులు ఎవరు?

(ఆకాశవాణి 12-02-2007)